# శాపమంటే? అవి నిజమేనా?

శ్రీరామచంద్రుని పట్టాభిషేకము తదుపరి రామరాజ్య సుభిక్షం రాజ్యంగా ఉండిన రోజులలో తోటలో చిలుకలు పలుకుతున్న పదాల అర్థం చేసుకొన్న సీతాదేవి ఆ చిలుకలను చేరి అవి పాడుకొంటున్న సీతారాముల వర్ణనను విని ఆశ్చర్యచకితురాలై ఆ చిలుకలను బటులచేత బంధించి తెప్పించుకొని వాటిని వివరము అడుగగా, వాల్మీకి మహర్షి ఆశ్రమంలోనే పట్టి అక్కడనే పెరిగినాము. వాల్మీకి మహర్షి రామాయణ గాథని లిఖించిన తన శిష్యులచేత పాడించుచుండగా నిత్యం అవి పాటలను, ఆ కథని వినిన తమకు రామాయన గాథ, కంఠస్తమయ్యి, తాము కూడా నిత్యం ఆ రామాయణ గాథని వల్లి వేస్తుంటామని చెప్పగా శ్రీరామునిని వర్ణించమని సీతాదేవి అడుగగా ఆ ఆడ చిలుక శ్రీరాముని వర్ణనని వర్ణించి తనని ఆ విధంగా అడిగిన స్త్రీ సీతాదేవి అని గ్రహించి నామధేయం అడగగా తనే సీతాదేవఇనని చెప్పడం జరిగినది. అంతటా ఆ చిలుకలు తమని విడచి పెట్టవలెనని వేడగా సీతాదేవి ఆ ముచ్చటైన రామ పలుకులకు మిక్కిలి చకితురాలై వెంటనే విడిచిపెట్టలేదు. గర్భంతో ఉన్న ఆడచిలుక అక్కడే మరణించెను. మరణానికి ముందర గర్భిణిగా ఉన్నపుడు తనను తన భర్త నుండి వేరు చేసిన కారణంగా సీతాదేవి గర్భం వచ్చిన తదుపరి భర్తకి దూరమగునని శపించి మరణించెను. ఆ తదుపరి మగ చిలుక అక్కడికి వచ్చి మరణించిన తన భార్యని చూచి మిక్కిలి బాధకి గురై తన అయోధ్యలో మనిషిగా జన్మించి తన మాటల వలననే సీతాదేవి ఎడబాటు పొంది మిక్కిలి దుఃఖించునని శపించి దేహం విడిచెను. (పక్షిపురాణం ఆధారంగా)

ఆ తదుపరి కాలంలో ఆ మగ చిలుక ఒక రజకునిగా ఆవిర్భవించి తనదైన కఠిన మాటలు మాట్లాడం జరిగినది. రావణుని చెరలో ఉన్న సీతాదేవికి దేవేంద్రుని అమృతాన్ని దేవతలు ఇవ్వగా తన పతికి, మరిదికి ఆ అమృతంలోని భాగాలను భూదేవికి అర్పించి తనదైన అమృతాన్ని తీసుకొనినది. తత్ఫలితంగా రావణుని చెరలో ఉన్న సీతాదేవి ఎలాంటి అన్న పానీయాలను తీసుకొనలేదు. విషపూరితమైన శక్తిని గాలిలో నింపే అశోక చెట్ల నడుమ ఉన్న సీతాదేవికి వాయుదేవుడు తనదైన శక్తితో అశోక చెట్ల విషపూరితమైన గాలిని వడబోసి స్వచ్ఛమైన గాలిని ప్రసాదించెను. ఇకపోతే ఆమె పాదం మోపిన రావణ స్థలంలో భూదేవి తనదైన శక్తితో ఆ నేలని (స్థలాన్ని) శుద్ధి చేసెను. సీతాదేవిని రావణ వధ తరువాత శ్రీరాముడు తిరిగి చేపట్టడం జరగగా యావత్ అయోధ్యావాసులు మిక్కిలి సంతశించగా ఒకే ఒక వ్యక్తి 'రజకుడు' తనదైన మాటలతో శ్రీరామునిని నిందించగా, ఆమాటలకు వ్యధ చెందిన శ్రీరాముడు లక్ష్మణుని సాయంతో సీతాదేవిని వనవాసంలో విడిచి పెట్టెను.

ఆ సమయానికి సీతాదేవి గర్భం దాల్చెను. ఒకనాటి చిలక జంటల శాపంతో సీతాదేవి గర్భం దాల్చిన తదుపరి భర్తకి దూరంగా ఉండవలసి వచ్చింది. 'శాపాల'నేవి ప్రతీకాలంలోను ఉన్నవి. ప్రస్తుతమూ ఉన్నవి. దీనికి వాక్ శక్తి కావలసి ఉన్నది.

అది తూర్పుగోదావరి జిల్లాలోని ఒక ఊరు. ఒక ఉత్తమ బ్రాహ్మణుడు కుమార్తె వివాహం చేయదల్చి తనకున్న రెండు ఎకరాల భూమిని అమ్మకం పెట్టబోవగా, ఆభూమి కౌలుదారుడు ఆ భూమి వదలకపోవడంతో ఒక లాయరుని ఆశ్రయించగా, చివరికి కేసు పెట్టి కోర్టులోనెగ్గి, తన కోర్టు ఖర్చులకు ఆ భూమి సరిపోయినదని సదరు లాయరుగారు చెప్పగా ఆ వృద్ధ బ్రాహ్మణుడు గుండెలు పగిలేగా రోధించి నేలపై ఉన్న మన్ను తీసి అరచేతులతోనే నేలపై విడిచి, అటు దేశాంతరాలు పట్టి పోయెను. ఆ తదుపరి ఆ లాయరు ఏకైక కుమారుడు ఒక ప్రేమ వివాహ సందర్భంగా ఆత్మహత్య చేసుకొనగా, ఆ తదుపరి సంవత్సరం తిరిగేలోగా కుమారుని ఎడబాటు భరించలేక ఆ లాయరు కూడ కన్నుమూసెను. ఇది ఆ బ్రాహ్మణుని శాపం.

దీనినే 'ఉసురు' అంటారు. ఉసురులు తగిలి కొండల్లాంటి ఆస్తులు నాశనమైనవారు ఎందరో, ఎదుట వ్యక్తిని అకారణంగా దూషిస్తే అది శాపంగా తగలకమానదు. ఎదుటివారి మనసుకి మిక్కిలి బాధకలిగితే అది ఉసురుగా మారిపోయి నాశనం కల్గిస్తుంది.

అధికారం, లౌఖ్యం, మోసం, అవకాశం అనే పద్ధతులు ద్వారా ఎదుటివార్కి కల్గించే ప్రతి ఒక బాధ ఉసురుగా కాలాంతంలో పరిణమిస్తుంది. మనిషిని సర్వనాశనం చేస్తుంది.

అత్తామామలు, భర్త వలన బలవంతంగా విషం మ్రింగి ఆ తదుపరి ప్రభుత్వాసుపత్రికి పరుగున వెళ్ళి తనకు జరిగిన విషప్రయోగం గురించి డాక్టరుకి చెప్పి హాస్పటల్లో మరణించిన సంఘటన ఒకనాడు ఒక ఊరిలో జరిగినది. ఆ తదుపరి ఆ అత్తామములు, భర్త సర్వనాశనం అయ్యినారు. ఇలాంటి సంఘటనలు కోకొల్లలు. ఇంటి కోడలు మరణానికి కారకులైన వారిని ప్రకృతి విడిచిపెట్టదు. సర్వనాశనం చేస్తూనే ఉన్నది. స్త్రీ ఉసురు, స్త్రీ శానం కాలనాగై కాటేయక వదలదు. ఒక అధికారి అకారణంగా ఏ కాలితోనైతో ఒక అమాయకుడిని తన్నాడో ఆ అధికారి కాలు కాలగమనంలో క్యాన్సర్ వ్యాధికి గురైన సంఘటలు చూసాము. మనిషి దేహంలోని ఆత్మహృదయపు పొరలలో ఉద్భవించి ఏర్పడిన 'ధర్మ'బద్ధమైన చర్యను ఎదుటి వ్యక్తి అధర్మంతో చిత్రవధ చేసినపుడు అట్టి ఆత్మ హృదయపు పొరలో అమిత దుఖ పూరితమైన రోదన జనిస్తుంది. ఈ హృదయ దుఖపూరితమైన రోదనే ఉసురుగాను లేక శాపంగాను రూపాంతరం చెందును. ఎదుటివార్కి అధర్మంగా ఏ అపకారమైతే చేస్తామో అదే అధర్మ అపకారం త్వరితకాలంలో వెనక్కి వచ్చి తగులును. ఇది ప్రకృతి యొక్క ధర్మ నియంత్రణ. ఈ విధమైన ధర్మనియంత్రణ లేకుంటే సామాన్యుడుఈ భూమిపై ఏనాడో కనుమరుగైపోయేవాడు. సీతాదేవి హృదయాంతరాళలో జ్వలించిన అగ్ని జ్వాలలకు యావత్ లంక సర్వనాశనం అయ్యినది. ద్వేషం ఉన్నచోట కొడితే తిరిగి వచ్చి ప్రేమ ఉన్నచోట తగులును. ఎవరూ దేనికీ అతీతులు కారు. దీనినే ఆత్మ సంతోషం, ఆత్మ దుఖం అందురు. ఆత్మ దుఖమే ఉసురుగాను శాపంగాను వెనక్కి వచ్చి తగునును.

**- పి. గిరిరాజు సిద్ధాంతి**

Click here to get your free novaPDF Lite registration key